www.prajasakti.com

ప్రజాశక్తి

శుక్రవారం 27 డిసెంబర్ 2024

5



నెట్‌బాల్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - ఆత్రేయపురం

రాష్ట్ర స్థాయి నెట్ బాల్ పోటీల్లో ఆత్రేయపురం మండల విద్యార్థుల ప్రతిభ చూపారని ఎంఇఒలు వరప్రసాదరావు, పచ్చ సాహెబ్‌లు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కర్నూలు జిల్లాలో ఈనెల 21, 22, 23 తేదీలలో నిర్వహించిన పదవ సబ్ జూనియర్ రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ పోటీల్లో ఆత్రేయపురం మండల విద్యార్థులు తమ్మి రంజిత్‌కుమార్, కడలి సత్యకుమార్, అత్తిలి హర్షవర్ధన్ వెంకటరమణ, కల్లూరి ఆదినారాయణ, కాకులపాటి కమల వెంకటేష్ విశేష ప్రతిభ కనబరిచారని ఎంఇఒలు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రతిభ చూపిన విద్యార్థులను మహాత్మా గాంధీ ఎయిడెడ్ పాఠశాల, జూనియర్ కళాశాల సంస్థల డైరెక్టర్ పిఎస్.రాజు, మహర్షి విద్యానికేతన్ డైరెక్టర్ ఎన్.రామరాజు, పిఇటిలు రవిరాజు, ఉపాధ్యాయులు, గ్రామాల పెద్దలు అభినందించారు.

అట్రాసిటీ కేసుల పరిష్కారానికి కృషి

కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్

ప్రజాశక్తి - అమలాపురం

ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసులను సత్వరమే పరిష్కరించేందుకు రెవెన్యూచ పోలీస్, న్యాయవ్యవస్థలు కృషి చేయాలని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ అన్నారు. గురువారం స్థానిక కలెక్టరేట్ నందు ఎస్‌సి, ఎస్‌టి దురాగతాల నివారణ చట్టం అమలుపై ఎస్‌సి, ఎస్‌టి నిఘా పర్యవేక్షణ జిల్లాస్థాయి కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్‌సి, ఎస్‌టిలపై అన్యాయంగా దాడులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎస్‌సి, ఎస్‌టిలపై జరుగుతున్న దాడులు, అఘాయిత్యాల సమాచారాన్ని క్షేత్రస్థాయిలో విచారించి, పరిశీలించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అణగారిన వర్గాలలో జరుగుతున్న అన్యాయాలపై రాజ్యాంగ విలువలను కాపాడేందుకు కమిటీ సభ్యులు అంకిత భావంతో పాటుపడాలన్నారు. అంబేద్కర్ ఆశయాలను ప్రతి ఒక్కరూ పాటించి దళితులకు ఎక్కడా అన్యాయం చోటు చేసుకోకుండా చూడాలన్నారు. జిల్లాలో సామాజిక రుగ్మతలను సమూలంగా తొలగించడమే లక్ష్యంగా అధికారులు పారదర్శకంగా నిబద్ధతతో విధులు నిర్వర్తించాలన్నారు. అణగారిన వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా, సమాజంలో ఎస్‌సి, ఎస్‌టిలపై దాడులు జరగకుండా చూడాల్సిన బాధ్యత చట్టాలపై అవగాహన పెంపొందించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఎస్‌సి, ఎస్‌టి ప్రత్యేక కోర్టులలో కేసుల సత్వర పరిష్కారం కొరకు ఎటువంటి జాప్యం జరగ కుండా జాగ్రత్తలు వహించాలన్నారు. కేసుల సత్వర విచారణకు అవసరమైన ధ్రువపత్రాలు ఎప్పటికప్పుడు తహశీల్దార్లు జారీ చేయాలన్నారు. నిజమైన బాధితులకు న్యాయం జరగాలని, ఎస్సీ, ఎస్టీ వర్గాల హక్కులు, రక్షణ కొరకు ఏర్పాటైన చట్టాల పటిష్ట అమలుకు పోలీస్, న్యాయ రెవెన్యూ శాఖలు సమన్వయంతో పనిచేయాలని కోరారు. గతంలో జరిగిన కమిటీ సమావేశంలో చర్చించిన అంశాలపై తీసుకున్న చర్యలను, ఈ త్రైమాస కాలంలో నమోదైన ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసుల విచారణ, బాధితులకు పరిహారాల పంపిణీ పురోగతిని సమీక్షించారు. జిల్లావ్యాప్తంగా మొత్తం 95 కేసులు నమోదు కాగా వీటిలో ప్రాథమిక విచారణ దశలో 52 కేసులు, చార్జి సీటు దశలో 49 కేసులు, పోస్ట్ మార్టం దశలో రెండు కేసులు ఉండగా సంబంధిత బాధితులకు రూ.81లక్షల 25 వేలు చెల్లించాల్సింది ఉందని రూ. 30 లక్షలు మేర మాత్రమే నిధులు ఇటీవల మంజూరయ్యాయన్నారు. పౌరులందరికీ సమాన హక్కులు, అవకాశాలు కల్పించే రాజ్యాంగ మౌలిక స్ఫూర్తికి అనుగుణంగా ఏర్పాటు కాబడిన ఎస్‌సి, ఎస్‌టి ప్రత్యేక చట్టాలను అధికారులు పటిష్టంగా అమలు చేయాలన్నారు. స్థానికంగా అంబేద్కర్ కోనసీమ జిల్లాకు ఎస్‌సి, ఎస్‌టి కోర్టు మంజూరు అయిందని తెలిపారు .ఎస్‌సి, ఎస్‌టిలకు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ద్వారా కల్పిస్తున్న రుణ సదుపాయాల ద్వారా సుస్థిర జీవనో పాదుల కల్పనకు పాటు పడాలన్నారు .ఆర్డబ్ల్యూఎస్ వారు ఎస్‌సి, ఎస్‌టి కాలనీలకు జలజీవన్ మిషన్ ద్వారా ప్రతీ ఇంటికి కుళాయిని వేయాలని అన్నారు. సఫాయి కర్మచారి కార్మికులకు పథకాల ద్వారా లబ్ధిని చేకూర్చాలన్నారు. పిఎం అజయ్ కార్యక్రమం ద్వారా మండలానికి నాలుగు చొప్పున యూనిట్లు గ్రౌండ్ చేయాలన్నారు. డ్వామా ద్వారా వేతన జీవులకు నూరు శాతం పని దినాలు సరాసరి వేతనాలు చెల్లిస్తూ మెటీరియల్ కాంపోనెంట్ ద్వారా ఆవాసాలలో మౌలిక వసతులను కల్పించాలని అన్నారు. లక్షిత వర్గాల వారికి ఉద్యాన సాగును పథకాలు,రాయితీలతో ప్రోత్సహించి జీవన ప్రమాణాలను మెరుగుప రచాలన్నారు. జిల్లా పరిశ్రమల కేంద్రం ద్వారా నిర్దేశిత ఎస్‌సి, ఎస్‌టి లబ్ధిదారులకు ట్రావెలింగ్ బిజినెస్, క్వాయర్ పరిశ్రమలకు రాయితీతో యూనిట్లు గ్రౌండ్ చేయాలన్నారు. అదేవిధంగా పశుసంవర్ధక శాఖ, పంచాయతీరాజ్, ఇంజినీరింగ్ విభాగాల ద్వారా లక్షిత వర్గాలకు లబ్ధిని చేకూర్చాలని అన్నారు. స్థానిక శాసనసభ్యులు అయితాబత్తుల ఆనందరావు మాట్లాడుతూ పోలీస్ అధికారులు తమ స్టేషన్లకు వచ్చిన ఫిర్యా దులపై రాజీపడాలని ధోరణిని ప్రదర్శించడంతో మరల అవే కేసులు పునరావృతం అయ్యి జటిలంగా మారుతున్నాయని అన్నారు. ఫిర్యాదులు వచ్చిన సందర్భంలో స్వీకరించి తప్పనిసరిగా విచారించాలని సూచించారు. శాంతియుతమైన సామరస్య మైన పౌర జీవనాన్ని పెంపొందించేందుకు ఈ చట్టాల గురించి అన్ని వర్గాల ప్రజలకు సమగ్ర మైన అవగాహన కల్పించాలని సూచించారు. ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసుల విచారణ వేగవంతం చేసి బాధితులకు సత్వర న్యాయం అందించాలన్నారు. దోషులకు తప్పనిసరిగా శిక్షపడా లని ప్రేరేపిత కేసులకు ఆస్కారం ఇవ్వరాదన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, అడ్మిన్ ఎస్‌సి ప్రసాద్, డిఆర్‌ఒ ఇన్‌ఛార్జి కె.మాధవి, ఆర్‌డిఒలు పి. శ్రీకర్, డి.అఖిల, జిల్లాస్థాయి అధికారులు, డిఎస్‌పిలు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న అధికారులు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్‌కుమార్


నేటి నుంచి మహిళల వాలీబాల్ పోటీలు



బీచ్‌లో ఏర్పాట్లపై సూచనలిస్తున్న ఎంఎల్‌ఎ ఆనందరావు

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

ఎస్.యానాం బీచ్‌లో నేటి నుంచి మూడు రోజుల పాటు జాతీయస్థాయి మహిళా బీచ్ వాలీబాల్ పోటీలు నిర్వహించనున్నారు. తొలిసారిగా ఈ ప్రాంతంలో లీగ్ కమ్ నాకౌట్ పద్ధతిలో మహిళా బీచ్ వాలీబాల్ పోటీలు నిర్వహిస్తుండడంతో బీచ్ లో ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ పోటీల్లో మన రాష్ట్రంతో పాటు గుజరాత్, గోవా, కేరళ, పాండిచ్చేరి, తమిళనాడు, వెస్ట్ బెంగాల్‌కు చెందిన మహిళా వాలీబాల్ జట్లు పాల్గొన్నాయి. ఈ నేపథ్యంలో వాలీబాల్ టోర్నమెంట్ గౌరవ అధ్యక్షులు ఎంఎల్‌ఎ అయితా బత్తుల ఆనందరావు ఈ పోటీల నిర్వహణను ప్రతిష్టాత్మకంగా చేపట్టారు. క్రీడాభిమానులు తిలకించేందుకు సముద్ర తీరంలో గ్యాలరీలు ఏర్పాటు చేశారు. బీచ్ ను సుందరంగా తీర్చిదిద్ది క్రీడలు తిలకించేందుకు వచ్చే వారికి బీచ్‌లో ఎటువంటి అసౌకర్యం కలగకుండా ముమ్మర సదుపాయాల ఏర్పాట్లు చేపట్టారు.ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ ఆనందరావు గురువారం బీచ్‌లో జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించి పలు సూచనలు సలహాలు ఇచ్చారు. ఎస్.యానాం బీచ్ ను పర్యాటకులు ఆకర్షించే విధంగా రానున్న రోజుల్లో పూర్తిస్థాయిలో బీచ్‌ను ఆధునీకరించి దేశంలోని పర్యాటక కేంద్రాలలో ఎస్.యానాం బీచ్ ను ఒకటిగా చేర్చేందుకు తాను కషి చేస్తున్నట్టు ఎంఎల్‌ఎ ఆనందరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో టోర్నమెంట్ అధ్యక్షులు పలచోళ్ళ పద్మనాభం, ఉపాధ్యక్షులు లంకే భీమరాజు, కార్యనిర్వాహక కార్యదర్శి పీడీ గొలకోటి ఫణీంద్ర, కుమార్ నాయకులు పాల్గొన్నారు.



ఎస్.యానాం బీచ్‌లో పోటీలకు సిద్ధమవుతున్న కోర్టు

వసతి గృహం వద్ద పారిశుధ్య పనులు

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

గొల్లవిల్లి సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహం వద్ద గురువారం సర్పంచ్ జొన్నాడ శ్రీదుర్గ ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు నిర్వహి ంచారు. వసతి గృహం ముందు ఉన్న పంట కాలువలో చెత్త పేరుకుపోయి వసతి గృహంలోని విద్యార్థినిలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో పంటబోదెలో ఉన్న చెత్తను తొలగిం చడంతోపాటు వసతి గృహం వద్ద పారిశుధ్య పనుల నిర్వహించారు.ఈ కార్యక్రమంలో వైసిపి నాయకుడు జొన్నాడ చిన్ని, పంచాయతీ కార్యదర్శి అడబాల శ్రీరామచంద్రమూర్తి, ఇంజినీరింగ్ అసిస్టెంట్ ఆనంద్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న సర్పంచ్ శ్రీదుర్గ

సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

సమస్యల పరిష్కరించేందుకు ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని తహశీల్దార్ పి.చిన్నారావు అన్నారు. ఈ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన అన్నారు. గురువారం మండలంలోని మాచర గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామ సర్పంచ్ వాసంశెట్టి సునీత విష్ణుమూర్తి అధ్యక్షతన జరిగిన రెవెన్యూ సదస్సులో గ్రామ సభలో మండల ప్రత్యేక అధికారి డిఎల్‌డిఒ కామేశ్వరరావు, తహశీల్దార్ పి.చిన్నారావు పాల్గొని మాట్లాడారు. ఈ సదస్సుల ద్వారా భూ సమస్యలు, సర్వే సమస్యలు, భూ వివాదాలు, తదితర సమస్యలపై, రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు .అనంతరం గ్రామంలో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ గుడాల జయ బాబు, వాసంశెట్టి విష్ణుమూర్తి, గ్రామ కార్యదర్శి చినబాబు, ఆర్‌ఐ అజ్జమ్మ, విఆర్‌ఒ గన్నిరాజు, పలు గ్రామాల విఆర్‌ఒలు, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది, రైతులు తదితరులు, పాల్గొన్నారు.



మాచర రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న తహశీల్దార్ పి.చిన్నారావు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - రామచంద్రపురం

ద్రాక్షరామం సెక్షన్‌లో 33 /11 కెవిలో 11 కెవి తాళ్ల పొలం ఫీడర్ మరమ్మతులు, ట్రీ ట్రిమింగ్స్ చేసేందుకు శుక్రవారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు రామచంద్రపురం డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.రత్నాల రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జెకె.పాలెం, తాళ్లపాలెం, నెల్లపర్తిపాడు, మామిడి గుంట, వేలంపాలెం, ఉట్రిమిల్లి తదితర గ్రామాల్లో శుక్రవారం ఉదయం 8 నుంచి 12 గంటలకు వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు.

గోతులు లేని రహదారుల నిర్మాణమే లక్ష్యం

ఎంఎల్‌ఎ బండారు సత్యానందరావు

ప్రజాశక్తి - ఆలమూరు

గోతులు లేని రహదారులను సంక్రాంతి పండుగ వచ్చే ముందు ప్రయాణికులకు నిర్మించి అందించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని కొత్తపేట ఎంఎల్‌ఎ బండారు సత్యానందరావు అన్నారు. మండలంలోని కొత్తూరు సెంటర్ నుంచి వెదురుమూడి వెళ్లే రహదారికి మరమ్మతు పనులకు ఆయన గురువారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా సత్యానందరావు మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వ చేతకాని పాలనతో రహదారులు అధ్వానంగా మారాయన్నారు. ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఒక్కొక్కటిగా అభివృద్ధి చేస్తూ వస్తుందన్నారు. ఇందులో భాగంగా తక్షణం ప్రజా రవాణాకు గోతులు లేని రోడ్లను ప్రజలకు అందించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం ఆ దిశగా పనులు వేగవంతం చేస్తామన్నారు. కార్యక్రమంలో కొత్తపేట నియోజకవర్గం రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు వంటిపల్లి పాపారావు, మండల డిసి అధ్యక్షులు మెర్ల గోపాలస్వామి, పినపళ్ల సర్పంచ్ సంగీత సుభాష్, చింతలూరు సర్పంచ్ మార్గాన్ని కరుణ ఏసు, నీటి సంఘం అధ్యక్షులు గారపాటి శ్రీనివాస్, కూటమి నాయకులు ఈదల సత్తిబాబు, సలాది నాగేశ్వరరావు, తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



రోడ్డుకు మరమ్మతు పనులు ప్రారంభిస్తున్న ఎంఎల్‌ఎ బండారు సత్యానందరావు

శిరోముండనం బాధితులకు న్యాయం చేయాలి

ప్రజాశక్తి - అమలాపురం

శిరోముండనం బాధితులకు న్యాయం చేయాలని 'విదసం' (విస్తృత దళిత సంఘాల) నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. గురువారం బాధితులతో కలిసి విదసం ప్రతినిధులు కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్‌ను కలిసి వినతపత్రం అందజేశారు. అనంతరం ఐక్య వేదిక రాష్ట్ర సమితి కన్వీనర్ డాక్టర్ బూసి వెంకటరావు విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలో ఉన్నా అంబేద్కర్ కోనసీమ జిల్లాలో అధికారులు వైసిపి ఎంఎల్‌సి తోట త్రిమూర్తులుకు కొమ్ము కాసే వైఖరి మారలేదన్నారు. అట్రాసిటీ కేసులో నిందితులను కాపాడే అధికారులపై సెక్షన్ 4 ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. శిరోముండనం కేసులో బెయిల్ మీదున్న తోట త్రిమూర్తులుపై ప్రభుత్వం తరఫున హైకోర్టులో తక్షణమే క్రాస్ అప్పీల్ వేయాలని డిమాండ్ చేశారు. 1996లో వెంకటాయిపాలెం దళితులకు తోట త్రిమూర్తులు శిరోముండనం చేసిన కేసులో త్రిమూర్తులు, అతని సోదరులకు 18 నెలలు జైలు శిక్ష పడిందని, ఈ శిక్షను రద్దు చేయాలని త్రిమూర్తులు ఏప్రిల్ నెలలో హైకోర్టులో అప్పీలు వేశారని తెలిపారు. ఈ అప్పీల్‌ను ఛాలెంజ్ చేస్తూ క్రాస్ అప్పీల్ వేయాల్సిన పోలీసు అధికారులు వైసిపి నాయకుడు తోట త్రిమూర్తులు కొమ్ము కాసి బాధిత దళితులకు అన్యాయం చేశారని విమర్శించారు. బాధితుల పిల్లలకు కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరులోనూ రెవెన్యూ అధికారులు ఇబ్బందులు పెడుతున్నారన్నారు. త్రిమూర్తులు అప్పీల్‌పై హైకోర్టు నుంచి పోలీసు అధికారులకు ఏప్రిల్ నెలలోనే సమాచారం వచ్చినా నేటికి 8 నెలలు గడిచినా త్రిమూర్తులుకు వ్యతిరేకంగా కోర్టు ప్రక్రియ చేపట్టలేదన్నారు. ఇది పూర్తిగా నిందితుడు తోట త్రిమూర్తులును జైలు శిక్ష నుండి కాపాడటానికి అధి కారులు పన్నిన కుట్ర కాదా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ చైర్మన్ కలెక్టర్ చర్యలు తీసుకుని తక్షణమే క్రాష్ అప్పీల్ వేసి త్రిమూర్తులను జైలుకు పంపాలని, నేరస్తులకు కొమ్ము కాసే అధికారులపై సెక్షన్ 4 కింద చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రేవు తిరుపతిరావు అధ్యక్ష తన జరిగిన ఈ కార్యక్రమంలో గుబ్బల శ్రీనివాస రావు, వెంటపల్లి రామ కృష్ణ, బూల భాస్కర రావు, మూర మహేశ్, పాలమూరి మోహన్, బడుగు జోగేష్, శెట్టిబత్తుల తులసి రావు, అమలదాసు బాబూరావు, కోటి చినరాజు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న విదసం నాయకులు

2న మండల స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన

ప్రజాశక్తి - మామిడికుదురు

మండలంలోని ఈదరాడ హైస్కూల్ నందు వచ్చే నెల 2వ తేదీన మండల సాయి విద్యా, వైజ్ఞానిక ప్రదర్శన ఏర్పాటు చేశామని విద్యాశాఖ అధికారులు లక్ష్మీనారాయణ, వెంకన్నబాబులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు మండల పరిధిలో అన్ని ప్రభుత్వ, ప్రయివేటు యాజమాన్యాల ఉన్నత పాఠశాలల విద్యార్థులు ఈ ప్రదర్శనలో భాగస్వాములు కావాలన్నారు. నోడల్ హెచ్‌ఎంగా సాయిబాబాను ఎంపిక చేశామన్నారు. మరిన్ని వివరాలకు సెల్ నెం.9493276782లో సంప్రదించాలని అన్నారు.

కొమరాడ పంచాయతీ సందర్శన

ప్రజాశక్తి -మామిడికుదురు

లూటుకుర్రు పిహెచ్‌సి పరిధిలో కొమరాడలో పంచాయతీ గురువారం డిఎంహెచ్‌ఒ కార్యాలయము నుంచి డిఎల్‌టిఎఫ్ టీం సందర్శించింది. ఎంఎల్‌హెచ్‌పి, ఎఎన్ఎంల గత మూడు సంవత్సరముల రికార్డులు పరిశీలించారు ప్రస్తుతం ఉన్న గర్భిణులను, బాలింతలను, కౌమార దశ బాలికలను రప్పించి వారికి రక్త పరీక్షలు నిర్వహించి ఆన్లైన్ రికార్డు ద్వారా వెరిఫై చేశారు. ఈ కార్యక్రమంలో డిఎల్‌టిఎఫ్ టీం, సర్పంచ్ వలవల సత్యవేణి, ఎంఎ ి ఎస్‌ఇ డి.ప్రసాద్, హెచ్ఎస్ సిహెచ్.రాజేంద్రబాబు, హెల్త్ అసిస్టెంట్ కె.ఉమామహేశ్వరరావు, సిహెచ్‌ఒ.అరుణ, వై.లావణ్య, ఆశా వర్కర్లు, సిహెచ్.మణి, కెడి.నాగలక్ష్మి పాల్గొన్నారు.



సందర్శించిన డిఎల్‌టిఎఫ్ బృందంతో ఆశా వర్కర్లు, ఎఎన్ఎంలు

ఘనంగా గణిత దినోత్సవం

ప్రజాశక్తి- ఉప్పలగుప్తం

గొల్లవిల్లి జడ్‌పి ఉన్నత పాఠశాలలో శుక్రవారం హెచ్‌ఎం లంక రాణి అధ్యక్షతన గణిత దినోత్సవ వేడుకలను గురవారం ఘనంగా నిర్వహించారు. ప్రఖ్యాత గణిత శాస్త్రవేత్త రామానుజన్ 137 వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన ఎగ్జిబిషన్‌ను మండల విద్యాశాఖ అధికారి సత్తి సత్యకృష్ణ, ఉపాధ్యాయులు తిలకించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వై.సత్యనారాయణ, అడబాల శ్రీనివాసరావు, గణిత ఉపాధ్యాయులు కొవ్వలి గణేశ్వరరావు, యు.జయరాం, ఎం.వసంతలక్ష్మి,కడలి వెంకట సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థుల ప్రదర్శనను తిలకిస్తున్న ఎంఇఒ సత్యకృష్ణ, హెచ్‌ఎం రాణి

హౌసింగ్ పీడీగా నరసింహారావు


ప్రజాశక్తి - ముమ్మిడివరం

అంబేద్కర్ కోనసీమ జిల్లా గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా ఎంవి.నరసింహారావు గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు పని చేసిన మదన్ మోహన్‌రావు బదిలీపై వెళ్లిన నేపథ్యంలో నరసింహారావు ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా వచ్చారు. బాధ్యతలు చేపట్టిన నరసింహారావు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న గహ నిర్మాణ లక్ష్యాల సాధనకు కృషి చేస్తానని పేర్కొన్నారు.



నరసింహారావు

కార్టూ'నిజం'



'తలారి' సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - మండపేట

తలారి కుటుంబం సేవలు అభినందనీయమని ఆంధ్ర ఎవాంజెలికల్ లూథరన్ చర్చ్ మండపేట మండల అధ్యక్షులు రెవరెండ్ ఖండవల్లి సామ్యూల్ పేర్కొ న్నారు. మండపేట పట్టణం న్యూ కాలనీకి చెందిన తలారి సైమన్ ప్రసాద్ మాస్టారు జ్ఞాప కార్థం ఆయన కుటుంబం ప్రతి ఏడాది ప్రభుత్వ పాఠశాలల ప్రతిభ గల విద్యార్థులకు ఆర్థిక ప్రోత్సాహక బహుమతులను అందిస్తుంది. ఈ కార్యక్రమం లో భాగంగా గురువారం స్థానిక ఎపిఫానియా లూథరన్ చర్చ్ లో ఏర్పాటుచేసిన బహుమతి ప్రదానో త్సవ కార్యక్రమం నిర్వహించారు. జవహర్లాల్ మున్సిపల్ ఉన్నత పాఠశాల విద్యార్థిని బి.పల్లవి, వేగుళ్ళ సూర్యారావు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని వై.కిరణ్మయిలకు ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున సైమన్ ప్రసాద్ సతీమణి అనసూయ సైమన్ ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో తలారి కుటుంబ సభ్యులు ఆదాయ పన్ను శాఖ ఇన్‌స్పెక్టర్ తలారి అమరేంద్ర ప్రసాద్, జీవిత బీమా సంస్థ సైబర్ సెక్యూరిటీ అధికారి తలారి సురేష్ కుమార్, వ్యవసాయ అధికారిణి తలారి పద్మజారాణి, లూథరన్ చర్చ్ కార్యనిర్వాహక సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినికి నగదు అందజేస్తున్న తలారి కుటుంబ సభ్యులు

శాంతి భద్రతలకు విఘాతం లేకుండా వేట కొనసాగించాలి

ప్రజాశక్తి - ఆత్రేయపురం

శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా వేట కొనసాగించాలని డిఎస్‌పి వై.గోవిందరావు అన్నారు జిల్లా ఎస్‌పి బివి.కృష్ణారావు ఆదేశాల మేరకు డిఎస్‌పి వై.గోవిందరావు అధ్యక్షతన గురువారం కొత్తపేట డిఎస్‌పి కార్యాలయంలో బొబ్బర్లంక, ధవళేశ్వరం గ్రామాలకు చెందిన ఫిషర్ మేన్ సొసైటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రెండు వర్గాల వారితో ఆయన చర్చించారు. రొయ్యల సీడ్ వేట కోసం ఘర్షణలు పడకుండా ఎవరి పరిధిలో వారు వేట సాగించాలని సూచించారు. ఏదైనా సమస్య ఉత్పన్నమైతే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. వివాదాలు, గొడవలు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ వివాద పరిష్కారం కోసం తదుపరి సమావేశంలో చేపల వేట, రొయ్యలు వేటకు సంబంధించి సూచనలు ఇస్తామని అప్పటివరకు శాంతియుతంగా వేట సాగించాలని సూచించారు. ఎవరైనా నిబంధనలను అతిక్రమించి ప్రవర్తించినట్లయితే వారి పైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో రావులపాలెం రూరల్ సిఐ సిహెచ్.విద్యాసాగర్, ఎస్ఐ ఎస్.రాము, తహశీల్దార్ రాజేశ్వరరావు, ఫిషరీస్ డిపార్ట్మెంట్ అధికారులు పాల్గొన్నారు.

అల్ట్రా స్కానింగ్ సెంటర్లపై పటిష్ట నిఘా : ఆర్‌డిఒ

ప్రజాశక్తి - అమలాపురం

గర్భస్థ పిండ ఆరోగ్య పరిశీలన కొరకు వినియోగించే అల్ట్రా స్కానింగ్ వైద్య పరీక్షలను లింగ నిర్ధారణకు దుర్వినియోగం కాకుండా అల్ట్రాసౌండ్ స్కానింగ్ సెంటర్లపై పటిష్ట నిఘాతో పాటుగా డెకాయ్ ఆపరేషన్లు నిర్వహించాలని ఆర్‌డిఒ కె.మాధవి తెలిపారు. గురువారం రెవెన్యూ డివిజన్ కార్యా లయంలో ఆర్‌డిఒ అధ్యక్షతన అధ్యక్షతన వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, మహిళా శిశు సంక్షేమ శాఖ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో కలిసి డివిజన్ స్థాయి (పిసి, పిఎన్ డిటి) లింగ నిర్ధారణ నిషేధ చట్టం 1994 చట్టం అమలు తీరు అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆడ శిశువుపై వివక్షతో జరిగే భ్రూణ హత్యలను నివారించేందుకు ప్రభుత్వం చట్టపరమైన చర్యలు చేపడతామన్నారు. తదనుగుణంగా అల్ట్రాసౌండ్ వైద్య పరీక్షలు లింగ నిర్ధారణ కు ఉపయోగించుకోవడం చట్ట రీత్యా నేరమన్నారు. డివిజన్ స్థాయిలో ప్రభుత్వ నిబంధ నలకు విరుద్ధంగా లింగనిర్ధారణ పరీక్షలు నిర్వహించే స్కానింగ్ సెంటర్లపై డెకాయ్ ఆపరేషన్లు నిర్వహించి చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆమె కమిటీ సభ్యులకు సూచించారు. డివిజన్ స్థాయిలో గుర్తింపు పొందిన స్కానింగ్ సెంటర్లపై డెకాయ్ ఆపరేషన్లు, ఆకస్మిక తనిఖీలు క్రమం తప్పకుండా నిర్వహిం చాలన్నారు. కమిటీ సభ్యులు గ్రామస్థాయిలో కూడా అనధి కారికంగా జరుగుతున్న అబార్షన్లను గుర్తించి లింగ నిర్ధారణ నిషేధిత చట్టపరంగా చర్యలు తీసుకోవాలన్నారు. స్కానింగ్ సెంటర్ల రెన్యువల్ నిమిత్తం డివిజన్ స్థాయి కమిటీ ఆమోదించిన దరఖాస్తులను జిల్లా స్థాయి కమిటీకి నివేదించాలని సూచించారు. ప్రతి స్కానింగ్ సెంటర్‌లోను చట్టానికి సంబంధించిన వాల్ పోస్టర్లను, వివరాలతో తప్పని సరిగా ప్రదర్శించాలన్నారు.అదనపు డిఎంహెచ్‌ఒ సిహెచ్‌వి.భరత లక్ష్మి ప్రసంగిస్తూ ఆడ శిశువులపై వివక్షత జరిగే ప్రాంతాలలో భ్రూణ హత్యలను నివారించడంతో పాటు డివిజన్ స్థాయిలో లింగ నిష్పత్తి తక్కువగా ఉన్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, డెకాయ్ ఆపరేషన్ నిర్వహించాలన్నారు. గర్భస్థ పిండ ఆరోగ్య పర్యవేక్షణకు సంబంధించిన పరీక్షలను లింగ నిర్ధారణకు దుర్వినియోగం కాకుండా అల్ట్రా సౌండ్ స్కానింగ్ సెంటర్లపై నిఘా ఉంచాలన్నారు. అల్ట్రా సౌండ్ వైద్య పరీక్షలు లింగ నిర్ధారణకు ఉపయోగించుకోవడం చట్ట రీత్యానేరమని, ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా లింగనిర్ధారణ పరీక్షలు నిర్వహించే స్కానింగ్ సెంటర్లపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. స్కానింగ్ సెంటర్లపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రసూతి వైద్య నిపుణులు డాక్టర్ మాధురి, చిన్నపిల్లల వైద్యులు డాక్టర్ పి వి పద్మిరాజ్ రేడియాలజిస్ట్ డాక్టర్ భరత్ సిఐ వీరబాబు లీగల్ సెల్ ఎన్‌జిఒల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నా రు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

ప్రజాశక్తి - శంఖవరం

మండలంలోని వేలంగి నుంచి పెద్దమలాపురం వెళ్ళే రహదారి మధ్యలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. పెద మల్లాపురం గిరిజన గ్రామానికి చెందిన బోడోజు వెంకటరమణ (18), బలుం సుబ్రహ్మణ్యం (24) బుధవారం రాత్రి 7.50 గంటలకు బైక్ పై వేళంగి నుంచి పెదమల్లాపురం గ్రామానికి వెళ్ళేందుకు బయలుదేరారు. బైక్‌ను మితిమీరిన వేగంతో నడపడంతో బైక్ అదుపు తప్పి వేళంగి నుంచి పెదమల్లాపురం వెళ్ళే రహదారి మధ్యలో రోడ్డు ప్రక్కనే గల భారీ వృక్షాన్ని ఢీ కొట్టారు. ఈ ప్రమాదంలో ఇరువురు యువకులకు తల వెనుక భాగంలో బలమైన గాయాలు తగలడంతో అక్కడికక్కడే మృతి చెందారు. ఈ మేరకు కేఉ నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అన్నవరం ఎస్ఐ శ్రీహరిబాబు తెలిపారు. శవ పంచనామా నిమిత్తం మృతదేహాలను ప్రత్తిపాడు ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు చెప్పారు

10 కిలోల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి - ఏలేశ్వరం

ఒడిసా నుంచి కర్ణాటక రాష్ట్రానికి వాహనంలో తరలిస్తున్న 10 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను స్థానిక పోలీస్‌స్టేషన్‌లో గురువారం డిఎస్‌పి శ్రీహరిరాజు వెల్లడించారు. బెంగళూరుకు చెందిన నయజ్ పాషా అతని భార్యతో కలిసి స్కోడా కార్లో ఒరిస్సా నుంచి 10.280 కిలోల గంజాయి తీసుకుని బెంగళూరుకి వెళుతున్నాడు. మండలంలోని ఎర్రవరం జాతీయ రహదారిపై సిపిఎఫ్ ఫ్యాక్టరీ వద్దకు వచ్చేసరికి భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. దీంతో నయజ్ భార్యను కారులోని ఉంచి కొడుతుండగా ప్రజలు గుమ్ముగూడి వారి మాటల్లో ఆంతర్యం గ్రహించి కారులో గంజాయి ఉందని తెలుసుకుని ఏలేశ్వరం పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఎస్ఐ ఎన్.రామలింగేశ్వర రావు సిబ్బందితో చేరుకుని గంజాయితోపాటు రూ.65 వేల నగదు, కారును స్వాధీనం చేసుకున్నారు. ఈ సమావేశంలో ప్రత్తిపాడు సిఐ బి.సూర్యఅప్పారావు, ఎస్ఐ ఎన్.రామలింగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

30 లీటర్ల సారా స్వాధీనం

ప్రజాశక్తి - గండేపల్లి

సారాను తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి, అతని నుంచి 30 లీటర్ల సారాను ఎక్సైజ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటనకు సంబంధించి వివరాలను ఎక్సైజ్ సిఐ అర్జునరావు మీడియాకు వెల్లడించారు. సారా తరలిస్తున్నట్లు వచ్చిన సమాచారంతో మండలంలోని నీలాద్రీరావుపేట గ్రామ రహదారిలో తనిఖీలు నిర్వహిస్తుండగా ఒక వ్యక్తి ద్విచక్రవాహనంపై సారాను తరలిస్తున్నట్లు గుర్తించి అరెస్టు చేశామన్నారు. 30 లీటర్ల సారాతోపాటు, వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఈ దాడిలో ఎక్సైజ్ ఎస్ఐ చిట్టిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

31 మంది బైండోవర్

ప్రజాశక్తి - గండేపల్లి

జగ్గంపేట సర్కిల్ పరిధిలో పాత కేసులు ఉన్న మొత్తం 33 మందిని బైండవర్ కేసులు నమోదు చేసి మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ ముందు హాజరు పర్చినట్లు సిఐ శ్రీనివాస్ తెలిపారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కిర్లంపూడిలో 11 మంది, జగ్గంపేటలో 8 మంది, గండేపల్లిలో 12 మంది మొత్తం 31 మందిని బైండోవర్ చేసినట్లు చెప్పారు. ఎవరైనా ఎటువంటి జూద క్రీడలకు పాల్పడిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

గాయపడిన యువకుని మృతి

ప్రజాశక్తి - మండపేట

ద్వారపూడి ఫ్లైఓవర్‌పై జరిగిన ప్రమాదంలో గాయాల పాలైన శవరం గ్రామానికి చెందిన గానుగుల ప్రేమ్‌కుమార్(16) రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆరోగ్యం విషమించి మృతి చెందాడు. గురువారం ఉదయం కేశవరం నుంచి ద్వారపూడి వస్త్రాలు కొనుగోలుకు మోటర్‌సైకిల్‌పై వచ్చాడు. ద్వారపూడి ఫ్లై ఓవర్ వద్ద మోటర్ సైకిల్ అదుపు తప్పి పడిపోయింది. దీంతో తలకు తీవ్ర గాయం కాగా అపస్మారక స్థితిలోకి వెళ్ళాడు. అతనికి రాజమహేంద్రవరం తరలించి చికిత్స అందించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడనీ స్థానికులు చెప్పారు. మండపేట రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

ప్రజాశక్తి - పి.గన్నవరం

గంటి పెదపూడి వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. ఈ ప్రమాదంలో ముగ్గురుకు గాయాలయ్యాయి. వివరాలు ఇవి.. రోడ్డుపై ప్రయాణిస్తున్న ఆటోకు కుక్కలు అడ్డు రావడంతో ఆటో బోల్తా పడింది. ఆటోలో ప్రయాణిస్తున్న నలుగురు ప్రయాణికులకు ఒక వ్యక్తికి తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మరణించాడు. మృతుడు కొంకాపల్లికి చెందిన సవరపు పల్లయ్య (60)గా గుర్తించారు. స్థానికుల సహాయంతో క్షతగాత్రులను 108లో పి.గన్నవరం ఆసుపత్రికి తరలించారు.

పంట కాలువలో పడి బాలుని మృతి

ప్రజాశక్తి - తాళ్లపూడి

ఇంటి పక్కన ప్రవహిస్తున్న పంట కాలువలో పడి నాలుగేళ్ల బాలుడు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని బల్లిపాడులో గురువారం చోటు చేసుకుంది. తాళ్లపూడి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అలపాకల అద్విత్ కుమార్ (4) ఆడుకుంటూ ఇంటి పక్కన ప్రవహిస్తున్న వేగేశ్వరపురం ఎత్తిపోతల పథకానికి చెందిన పంట కాలువలో ప్రమాదవశాత్తు పడిపోయి మృతి చెందాడు. బాలుని మేనమామ పాండురంగారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశామని ఎస్ఐ టి.రామకృష్ణ తెలిపారు. సంఘటనా ప్రదేశాన్ని రెవెన్యూ పోలీస్ అధికారులు పరిశీలించారు.

వరకట్నం వేధింపులపై కేసు

ప్రజాశక్తి - ఆత్రేయపురం

అదనపు కట్నం తేవాలంటూ భార్యను వేధిస్తున్న భర్త పై పోలీసులు కేసు నమోదు చేశారు. వారి వివరాలు ప్రకారం.. మండలంలోని అంకంపాలెం గ్రామానికి చెందిన కాయల సునీత కు అదే గ్రామానికి చెందిన కాయలు అనిల్ కుమార్‌తో 2021లో వివాహం జరిగింది. వీరికి ఓ కుమారుడు ఉన్నాడు. అనిల్ కుమార్ మద్యానికి బానిసై భార్య సునీతను అదనపు కట్నం తేవాలంటూ వేధిస్తున్నాడు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్.రాము తెలిపారు.

వరుస అల్పపీడనాలతో రైతుల్లో ఆందోళన



వాతావరణ మార్పులతో ధాన్యం పట్టుబడికి సిద్ధం చేస్తున్న రైతులు

ధాన్యాన్ని అయినకాడికి అమ్ముకుంటున్న రైతులు

ప్రజాశక్తి - అంబాజీపేట

బంగాళాఖాతంలో వరుస అల్పపీడనాలు, చలిగాలులతో కూడిన చిరుజల్లులు వదలకుండా వస్తుండడంతో రైతుల గుండెల్లో గుబులు పుట్టిస్తోంది.. అంబాజీపేట, పి గన్నవరం, మామిడికుదురు, అయినవిల్లి పలు మండలాలలో ధాన్యం కల్లాలలో ఉండడంతో అల్పపీడనంలో భారీ వర్షాలు వస్తే ధాన్యం తడిసిపోతుందని ఫలితంగా తక్కువ ధరలకు అమ్ముకోవాల్సి వస్తుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

క్షేత్ర స్థాయిలో అమలుకాని పరిస్థితి

రైతులు తాము పండించిన పంటను దళారులు మధ్యవర్తులు అమ్ముకొని మోసపోకుండా మద్దతు ధరపై రైతులకు అవగాహన పెంపొందిస్తూ ప్రభుత్వం కొనుగోలు చేసి వెంటనే సొమ్ములు చెల్లిస్తుంది. ఉన్నతాధికారుల లక్ష్యాన్ని క్షేత్రస్థాయిలో కిందిస్థాయి సిబ్బంది నీరు కారుస్తూ దళారులకు లాభం చేకూర్చేలా వ్యవహరిస్తున్న తీరుతో చేసేది ఏమీ లేక అయిన కాడికి దళారులకే దాన్ని అమ్ముకోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. గతంలో ఉన్న ర్యాండమైజేషన్ ప్రస్తుతం లేదని రైతు తమకు ఇష్టం వచ్చిన మిల్లుకు ధాన్యాన్ని ఇష్టం వచ్చిన మిల్లుకు సరఫరా చేసుకో వచ్చని, గోనె సంచులు, లేబర్, రవాణా రవాణా చేస్తుందని చెబుతున్నా క్షేత్ర స్థాయిలో అమలు కావడంలేదని రైతులు వాపోతున్నారు.

4,650 టన్నుల ధాన్యాన్ని సేకరించాం

మండలంలో 3,009 ఎకరాల్లో సాగుచేయగా, ఎకరానికి 28 బస్తాల చొప్పున 6,400 టన్నుల దిగుబడి వస్తుంది. ఇప్పటి వరకూ 6,450 టన్నులు సేకరించామని ఇంకా 300 టన్నుల వరకూ సేకరించాల్సి ఉంది.

- డి.విజయకుమార్, వ్యవసాయాధికారి అంబాజీపేట మండలం

నిబంధనలతో దళారుల వైపై మొగ్గు

ధాన్యం పట్టుబడి పట్టాలంటే రైతు సేవా కేంద్రాలలో మన పంట ఈ క్రాప్‌లో నమోదు అయి ఉండాలి. అనంతరం కూపన్లు జారీ చేసి, అనంతరం ఈ ప్రొక్యూర్మెంట్ రిజిస్ట్రేషన్ చేయాలి. జియల్‌టి పక్రియ నమోదు చేయాలి. చివరకు ధాన్యం తరలించడానికి వచ్చిన వాహనం నెంబర్‌తో ట్రక్ షీట్ జనరేట్ చేసి ఎఫ్‌టిఒ వచ్చాక రైతు వేలిముద్రతో పక్రియ పూర్తి అవుతుంది. తీరా మిల్లుకు వెళ్లాక తేమశాతం పేరుతో పాయింట్‌కి కేజి వంతున కోత విధిస్తు న్నారు. ఇన్ని పనులు రైతుకు సాధ్యం కాక అయిన కాడికి అమ్ముకుంటు న్నారు. ఒకరి ద్దరు రైతులు మిల్లుకు ధాన్యం అమ్ము కుందామని ప్రయత్నిస్తే సంచులు లేవని, జిపిఎస్ ట్యాగ్ చేసిన వాహనాలు అందు బాటులో లేవని, జట్టు కూలీలను ఏర్పాటు చేసుకోవాల్చిన పరిస్థితులు నెలకొన్నాయి. గతంలో ఉన్న ర్యాండమైజేషన్, హమలీ చార్జీలు, రైతు ఖాతాలో పడినా ట్రాన్స్‌పోర్ట్ చార్జీలు రైతు మిల్ల ర్లకు, ప్రయివేటు వ్యక్తుల ఖాతాలలో పడడంతో రైతులు నష్ట పోతున్నారు. ఈ పొ ట్లు పడలేక దళారీలు అమ్ముకునేలా క్షేత్ర స్థాయి సిబ్బంది పరిస్థితులు నెలకొని ఉన్నాయని రైతులు వాపోతున్నారు.



అమ్మవారి బహూకరించిన వెండి ఆభరణాలను తిలకిస్తున్న ఎంఎల్‌ఎ బండారు

'నూకాంబిక' ఆలయ అభివృద్ధికి చర్యలు

ప్రజాశక్తి - ఆలమూరు

నూకాంబిక అమ్మవారి ఆలయాన్ని మరింత అభివద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామని కొత్తపేట ఎంఎల్‌ఎ బండారు సత్యానందరావు అన్నారు. గురువారం ఆలయ అభివద్ధిలో భాగంగా ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేసి శిలాఫలకాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎకు ఆలయ ఇఒ వీర్రాజు చౌదరి, గ్రామ పెద్దలు ఘన స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకున్న ఎంఎల్‌ఎ బండారు సిజిఎఫ్, మ్యాచింగ్ గ్రాంట్ కలిపి రూ.కోటి అరవై లక్షల నిధులతో నూతనంగా నిర్మించిన ప్రాకార మండపం, ముఖ మండపాలను ఆయన గురువారం ప్రారంభించారు. అలాగే దాతల సహకారంతో నిర్మించనున్న రూ. 64 లక్షలతో ఆలయ తూర్పు, పడమర రాజగోపురాలకు, పోతురాజు ఆలయానికి, రేకు షెడ్డులకు ఎంఎల్‌ఎ శంకుస్థాపనలు చేశారు. అలాగే అమ్మవారికి వెండి ఆభరణాలను బహూకరించిన పలువురు దాతలను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మార్గాని కరుణ ఏసు, నీటి సంఘం అధ్యక్షులు వైట్ల గంగరాజు, గారపాటి శ్రీనివాస్, ఆలయ మాజీ ఛైర్మన్లు వైట్ల శేషుబాబు దొమ్మేటి రామకృష్ణ, మండల నాయకులు ఈదల సత్తిబాబు సలాది నాగేశ్వరరావు, రామానుజుల శేషగిరిరావు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అన్నదాన పథకానికి విరాళం

ప్రజాశక్తి - ఆత్రేయపురం

మండలంలోని ర్యాలి గ్రామం స్వయంభు పుణ్యక్షేత్రం శ్రీ జగన్మోహిని కేశవ, గోపాల స్వామి వారి ఆలయానికి వచ్చే యాత్రికులకు అన్నదాన్ని నిర్వహించేందుకు దాత విరాళం అందజేశారు. గురువారం రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌కు చెందిన కోదండరామ సత్యనారాయణ రాజు, లక్ష్మీ దుర్గ దంపతులు రూ.18 వేలను అన్నదానం నిమిత్తం ఆలయ ఇఒ భాగవతుల వెంకటరమణమూర్తికి అందజేశారు. వీరికి స్వామివారి దర్శనం అనంతరం ఆశీర్వచనం చేయించి, స్వామి వారి శేష వస్త్రంతో సత్కరించారు

అభివృద్ధి కార్యక్రమాలకు అంచనాలు

ప్రజాశక్తి - అమలాపురం

జిల్లాలో చమురు సహజవాయువుల నిక్షేపాలను వెలికి తీసి వ్యాపారాలు నిర్వ హిస్తున్న చమురు సహజ వాయువుల సంస్థల కార్పొరేట్ సామాజిక బాధ్యత (సిఎస్ఆర్) నిధులతో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు అంచనాలు తయారుచేయాలి వివిధ శాఖల ఇంజినీర్లను జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టరేట్లో సిఎస్ఆర్ నిధులు మంజూరు కేటాయింపుల అంచనాల రూపకల్పనపై అధికారులు, ఇంజినీర్లతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గాల వారీగా ప్రజాప్రతి నిధులు తెలిపిన పనులకు సంబంధించి అంచనాలు రూపొందించాలని ఇంజినీర్లను ఆదేశించారు. సముద్ర ముఖద్వారం వద్ద డ్రెడ్జింగ్ పనులు, చేపడుతూ వివిధ పంటల ముంపు బెడద నివారణ చర్యలు, అధునాతన డ్రోన్ సాంకేతిక టెక్నాలజీ ఆధారంగా కాలువలు, డ్రెయిన్ల స్థలాల ఆక్రమణలను గుర్తింపు మౌలిక సదుపాయాలైన రోడ్లు, విద్యా సంస్థలలో మౌలిక వసతులకు సంబంధించిన మరమ్మత్తులు వంటి పనులకు అంచనాలు రూపొందించి చమురు సహజ వాయువుల సంస్థలకు మంజూరు నిమిత్తం సమర్పించాలని జిల్లా అర్థ గణాంకాధికారి (సిపిఒ) ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సిపిఒ వెంకటేశ్వర్లు, పంచాయతీరాజ్ సూపరింటెండెంట్ ఇంజినీర్ పి.రామకృష్ణారెడ్డి, డిఇ రాజకుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఇ సిహెచ్‌ఎన్‌వి.కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు విద్యార్థిని ఎంపిక

ప్రజాశక్తి - రావులపాలెం

జాతీయ స్థాయి నెట్ బాల్ బాల్ పోటీలకు ఈతకోట విద్యార్థి ఎంపికైనట్లు నెట్ బాల్ అసోసియేషన్ సెక్రటరీ పల్లా శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల కర్నూలు లో జరిగిన అండర్- 16 విభాగం రాష్ట్ర స్థాయి నెట్ బాల్ పోటీల్లో ఈతకోట ఉన్నతపాఠశాల 8వ తరగతి విద్యార్థి యార్లగడ్డ లావణ్య ప్రతిభ కనబర్చి చెన్నైలో జరిగే జాతీయ నెట్ బాల్ పోటీలకు ఎంపికైంది. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు కెఎస్‌వి.కృష్ణారెడ్డి, ఎస్ఎంసి ఛైర్మన్ పి.రమేష్, వైస్ ఛైర్మన్ కె. నాగమణి, సర్పంచ్ సుబ్బలక్ష్మి, ఉప సర్పంచ్ వై.నాగార్జున, ఎంపిటిసి సభ్యులు హరిబాబు, బి. సీతారత్నం, టిడిపి నాయకులు యర్రంశెట్టి నాగేశ్వరరావు అభినందించారు.

సిహెచ్‌సి మాజీ ఛైర్మన్ మునీశ్వరమ్మ మృతి

ప్రజాశక్తి - ఆలమూరు

మండల కేంద్రానికి చెందిన సిహెచ్‌సి మాజీ ఛైర్మన్ చల్లా మునీశ్వరమ్మ(80) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ గురువారం తుదిశ్వాస విడిచారు. దీంతో పలువురు నాయకులు చేరుకుని కుటుంబ సభ్యులైన చల్లా ప్రభాకరరావు, చల్లా నానాజీ, చల్లా భూషణములను పరామర్శించి తమ ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. మునీశ్వరమ్మ మృతదేహం వద్ద ఘన నివాళులర్పించారు. అనంతరం ఆమె అంతిమయాత్రను నిర్వహించి అంత్యక్రియలు పూర్తిచేశారు.

ఎస్ఎఫ్ఐ మండల కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - గొల్లప్రోలు

ఎస్ఎఫ్ఐ గొల్లప్రోలు మండల కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. గురువారం స్థానిక జూనియర్ కళాశాలలో జరిగిన సమావేశానికి ఎస్ఎఫ్ఐ పిఠాపురం కార్యదర్శి కె.సిద్దు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు జి.శ్రీకాంత్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా విద్యారంగంలో అనేక మార్పులు వస్తున్నాయని, కాని గొల్లప్రోలులో మాత్రం ఆ మార్పులు కన్పించడం లేదన్నారు. ప్రభుత్వ కళాశాలకు సొంత భవనం లేకపోవడం దారుణమన్నారు. తక్షణమే కళాశాలకు సొంత భవనాన్ని నిర్మించాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. అనంతరం నూతన కమిటీ ఎన్నిక జరిగింది. మండల ఎస్ఎఫ్ఐ అధ్యక్షురాలుగా వర్షిణి, కార్యదర్శిగా వడ్డి కాసులు, ఉపాధ్యక్షులుగా హేమ, స్వామి, సహాయ కార్యదర్శిలుగా బిందు, శివదుర్గ, కమిటీ సభ్యులుగా లక్కీ, వాసవి, మణి, రాంచరణ్, పవన్, హరి, సాయి ఎన్నికయ్యారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టాలి

ప్రజాశక్తి - తాళ్లరేవు

దాళ్వాకు నీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి వల్లు రాజబాబు డిమాండ్ చేశారు. తాళ్లరేవు ఇరిగేషన్ కార్యాలయం వద్ద డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఛైర్మన్ వేగేశ్న భాస్కరరాజు అధ్యక్షతన నీటి సంఘాల ప్రతినిధులతో గురువారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలు సంఘాల అధ్యక్షులు ఆయా పంట కాలువలపై ఉన్న సమస్యలను ఇరిగేషన్ అధికారులకు, డ్రెయినేజీ అధికారులకు వివరించారు. ఈ సందర్భంగా గోదావరిలో నీరు ముందుగా అంచనా వేయాలని, ఎన్ని ఎకరాలకు సాగునీరు అందించగలరని ఇరిగేషన్ డిఇఇ రామకృష్ణను వల్లు రాజబాబు ప్రశ్నించారు. ముందస్తుగా చర్యలు చేపట్టకపోవడం వల్ల ప్రతి ఏడాది రైతాంగం నీటి ఎద్దడి వల్ల దిగుబడి కోల్పోతున్నారని అన్నారు. అరటికాయలలంక స్లూయిజ్ సకాలంలో మూయకపోవడం వల్ల ఇంజరం వద్ద వందలాది ఎకరాలు నీట మునుగుతున్నాయని, దొమ్మేటి పేట, గ్రాంటు వద్ద స్లూయిజ్‌కు తలుపులు ఏర్పాటు చేయాలని కోరారు. కోరంగి నీటి సంఘం అధ్యక్షులు సాయిరాజు గుడ్డి వాని తూము ప్రాంతంలో రొయ్యల కంపెనీల వల్ల పంట కాలవ పాడవడంతోపాటు, మురుగునీరు దిగడం లేదని తెలిపారు. పోలేకుర్రు నీటి సంఘం అధ్యక్షులు అల్లూరి రామకృష్ణరాజు గాడిమొగ, ఓడలినాలి ఛానల్ పై ఉన్న సమస్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఎఇ అనూష, డ్రెయినేజీ శాఖ డిఇ పోచారావు., ఎఇ వీరబాబు పలు నీటి వినియోగదారుల సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.

31న మద్యం విక్రయాలు రద్దు చేయాలి

ప్రజాశక్తి - కాకినాడ

ఈనెల 31న నూతన సంవత్సర వేడుకల నేపథ్యంలో మద్యం షాపుల్లో విక్రయాలను పూర్తిగా రద్దు చేయాలని మద్యపాన వ్యతిరేక ప్రజా సంఘాల నాయకులు కలెక్టర్ షాన్ మోహన్ కోరారు. గురువారం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా మద్యపాన వ్యతిరేక కమిటీ కన్వీనర్ డాక్టర్ సూర్యనారాయణ మాట్లాడుతూ నూతన మద్యం పాలసీ వల్ల బ్రాందీ షాపులు టైమింగ్స్ లేకుండా అమ్మకాలు జరుగుతున్నాయన్నారు. రాత్రి పూట యువత మద్యం సేవించి రోడ్ ప్రమాదాలకు బలైపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నెల 31వ తేదీ నూతన సంవత్సర వేడుకల సందర్భంగా పెద్ద ఎత్తున మద్యం అమ్మకాలు జరిగితే అనేక ప్రమాదాలు జరగడమే కాకుండా శాంతి భద్రతల సమస్యలు కూడా తలెత్తుతున్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో 31 వ తేదీ పూర్తిగా మద్యం షాపులు మూయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మద్యపాన వ్యతిరేక కమిటీ సభ్యులు, అంబేద్కర్ ఉద్యమ సీనియర్ నేత అయితా బత్తుల రామేశ్వరరావు, ఐద్వా మహిళా సంఘం నేతలు సిహెచ్.రమణి, జి.భూలక్ష్మి, జన విజ్ఞాన వేదిక నాయకులు యు.సత్యనారాయణ, జి.ప్రసాద్, పిల్లి రామారావు, పలివెల వీరబాబు పాల్గొన్నారు. .

యానాం వార్తలు

పర్యావరణ పరిరక్షణ అందరి కర్తవ్యం

ప్రజాశక్తి - యానాం

పర్యావరణ పరిరక్షణ అందరి కర్తవ్యం కావాలని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు, రాష్ట్ర పర్యావరణ కమిటీ కన్వీనర్ .కెవివి.సత్యనారాయణ అన్నారు. గురువారం స్థానిక డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రోగ్రామ్ ఆఫీసర్ జయ వీరణ్ ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ క్యాంపు 3వ రోజు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణ అందరి కర్తవ్యం కావాలని, దానికి మొదట విద్యార్థులు పట్టుదలతో పనిచేసి మంచి పర్యావరణాన్ని భావితరాలకు అందించాలన్నారు. అనంతరం విద్యార్థుల చేత మొక్కలు నాటించారు. కార్యక్రమంలో దాట్ల దేవదానం రాజు, దంగేటి త్రిమూర్తులు, ఎన్‌వి.రమణ, కళాశాల ఇన్‌ఛార్జ్ ప్రధానాచార్యులు వివిఎల్‌పి.రాజు పాల్గొన్నారు.

ఎంఎల్‌ఎ అశోక్ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి - యానాం

స్థానిక ఎంఎల్‌ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ ఆధ్వర్యంలో గురువారం క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక ఫెర్రీరోడ్డులో గాజుల ఫంక్షన్ హాల్‌లో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో ఎంఎల్‌ఎ పాల్గొని క్రైస్తవులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన కేండిల్ లైట్ సర్వీస్, క్రిస్మస్ కేక్ కటింగ్, చిన్నారుల నృత్యాలు అందరిని అలరించాయి. ఈ వేడుకలో సివైఎఫ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ బిహెచ్‌వి.మూర్తిరాజు క్రిస్మస్ సందేశాన్ని అందించారు.

సహకార సంఘాల బలోపేతానికి కార్యాచరణ

ప్రజాశక్తి - గొల్లప్రోలు

రైతులకు మేలు కలిగేలా సహకార సంఘాలని బలోపేతం చేయడానికి కార్యచరణ చేద్దామని కేంద్ర సహకార మంత్రిత్వ శాఖ ఆంధ్ర, తెలంగాణ కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్ఎల్ఎన్‌టి.శ్రీనివాస్ పిలుపునిచ్చారు. గురువారం గొల్లప్రోలు దివిశాల సహకార పరపతి సంఘంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సహకార సంఘాల పనితీరు తెలుసుకునేందుకు ఉద్యోగులు రైతులతో సమావేశమై వారి అభిప్రాయాలు సేకరించి సంఘాలను ఏ విధంగా అభివృద్ధి చేయాలనే అంశంపై నివేదిక ఇవ్వనున్నట్లు చెప్పారు. కాకినాడ జిల్లాలో 15 సొసైటీలను సందర్శించి సమావేశాల నిర్వహిస్తున్నామని, దీని ద్వారా 2 వేలమంది రైతులను కలిసేలా ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపారు.

డిఎస్‌పి కార్యాలయాన్ని సందర్శించిన డిఐజి

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం పోలీస్ సబ్ డివిజన్ కార్యాలయాన్ని గురువారం ఏలూరు రేంజ్ డిఐజి జివిజి. అశోక్‌కుమార్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కార్యాలయంలోని రికార్డులను పరిశీలిం చారు. కేసుల పురోగతిపై పలు సూచనలు చేశారు. సబ్ డివిజన్ పరిధిలో రోడ్డు ప్రమాదాలు, నేర రికార్డులపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌పి విక్రాంత్‌పాటిల్, డిఎస్‌పి శ్రీహరిరాజు, ట్రైనింగ్ డిఎస్‌పి ఆర్.సుస్మిత, పలువురు సిఐలు పాల్గొన్నారు.

'ఆదిత్య'లో కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి - గండేపల్లి

ఆదిత్య యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో వాసన్ హస్పటల్స్ వారి సహకారంతో గురువారం కళాశాలలో కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ డిప్యూటీ ప్రో ఛాన్సిలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి మాట్లాడారు. ప్రతి ఒక్కరికి కంటి చూపు అనేది చాలా ముఖ్యమని,కళ్ళను జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. కంటి చూపును మెరుగు పరచుకోవడానికి ఆకుకూరలు ఎక్కువగా ఆహారంలో తీసుకోవాలని సూచించారు. కళాశాలకు చెందిన డ్రైవర్స్, నాన్ టీచింగ్ స్టాఫ్‌కు కంటి పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి తక్కువ ధరలకు కళ్ళ జోళ్లు అందజేశారు. కార్యక్రమంలో డీన్ క్యాంపస్ లైఫ్ మేనేజ్‌మెంట్ ప్రో.వి.సత్యనారాయణ, ప్రోగ్రాం కన్వీనర్ డాక్టర్ బిహెచ్‌వి.వరప్రసాద్, ఎన్ఎస్ఎస్. ఆఫీసర్ ఐవి వీరాంజనేయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వసతి గృహం పరిశీలన

ప్రజాశక్తి - రౌతులపూడి

స్థానిక ఇంటిగ్రేటెడ్ వసతి గృహాన్ని కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి కె.సింహాచలం, జిల్లా కమిటీ సభ్యులు ఏలేటి నానిబాబు గురువారం పరిశీలిం చారు. వసతి గృహంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసు కున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొన్ని రోజులుగా ఆర్ఒ ప్లాంట్ పని చేయడం లేదని, దానికి మరమ్మతులు చేయించేందుకు అధికారులు చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. ఆర్ఒ ప్లాంట్ పని చేయకపోవడంతో తాగునీటికి విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వసతి గృహం భవనానికి ఉన్న కిటికీలకు తలుపులు లేకపోవడంతో విద్యార్థులు దోమల బారిన పడి అనారోగ్యం పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మరుగుదొడ్లు సైతం శుభ్రంగా లేవన్నారు. తక్షణమే వసతి గృహంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

యువత వ్యాపార రంగంపై దృష్టి సారించాలి

ప్రజాశక్తి - తాళ్లరేవు

నిరుద్యోగ యువత వ్యాపార రంగంపై దృష్టి సారించడం ద్వారా అభివృద్ధి చెందాలని పుదుచ్చేరి ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు అన్నారు. స్థానిక దేవి మహల్ సెంటర్లో యానాంకు చెందిన కొప్పాడి సురేష్ ఏర్పాటు చేసిన బార్ బెకే టిక్కా బిర్యానీ హోటల్‌ను ఆయన గురువారం ప్రారంభించారు. నిరుద్యోగ యువతీ, యువకులు మారుతున్న కాలానికి అనుగుణంగా చిరు వ్యాపారాలు ద్వారా పలువురికి ఉపాధి కల్పించగలుగుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో ముమ్మిడివరం ఎఎంసి ఛైర్మన్ కుడుపూడి శివన్నారాయణ, జడ్‌పిటిసి దొమ్మేటి సామ్యూల్‌సాగర్, కోరంగి మాజీ సర్పంచ్ బర్రె లక్ష్మీనరసింహరాజు పాల్గొన్నారు.

వంగవీటి రంగాకు ఘన నివాళి

ప్రజాశక్తి - యంత్రాంగం

విజయవాడ తూర్పు మాజీ ఎంఎల్‌ఎ వంగవీటి మోహనరంగా వర్ధంతిని గురువారం పలుచోట్ల వివిధ పార్టీల నాయకులు నిర్వహించారు. **కపిలేశ్వరపురం** మండలం లోని అంగర గాంధీ సెంటర్ లో వంగవీటి మోహన రంగా 36వ వర్ధంతిని నిర్వహించారు .ఈ సందర్భంగా రంగా విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు . కార్య క్రమంలో గ్రామ సర్పంచ్ వాసా కోటేశ్వర రావు, వంగా నల్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు. **ఉప్పలగుప్తం:** విలసవిల్లి రంగా సెంటర్‌లో వంగవీటి మోహన రంగా విగ్రహానికి సర్పంచ్ సలాది ఊర్మిళదేవి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు కార్యక్రమంలో వైసిపి గ్రామ కమిటీ అధ్యక్షుడు సలాది సతీష్, కోలా ఏసు, నందుల సత్య, గుండుమోగుల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. **కొత్తపేట:** వాడపాలెం పంచాయతీ సెంటర్ వద్ద వంగవీటి రంగా విగ్రహానికి కొత్తపేట ఎంఎల్‌ఎ బండారు సత్యానందరావు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో బండారు బుల్లితాత,బండారు రాజా, చిక్కట్ల అబ్బు, బండారు వీరబాబు, బండారు రాజేష్ తదితరులు పాల్గొన్నారు.